అసంబంధ యాత్రికులు

గావ్ తీస్తున్న టాంగాలో వెనకవైపున కూర్చుని, ముందుకుచూస్తూ, యమునా నదిగట్టుపైనుండి ప్రయాణిస్తూ, సంగమ స్థలాన్ని, ఆకుపచ్చగాఉన్న యమునానదీ జలాన్నీ, దూరంగా దానితో సంగమిస్తున్న గంగానదినీ, చీమలబారుల్లా సంగమంవైపు నెమ్మదిగా కదుల్తున్న నావల్నీ, బ్రిడ్జిమీంచి పోతున్న కాశీ ఎక్స్‌ప్రెస్‌నూ చూస్తూ గొప్పఅనుభూతిని పొందుతున్నాడు హరికృష్ణ. యమునానదిలో ప్రతిబింబిస్తూ కనులకు పండుగ చేస్తున్న అలహాబాద్ కోట అశోకుడి కాలానికి అతని మనస్సుని మళ్లించి, పాతజ్ఞాపకాలను తోడి, మనస్సును సౌందర్యపిపాసతో నిలుపుతోంది.

"మీరు పిండాలు, అవీ వదుల్తారా బాబూజీ!" అన్నాడు టాంగావాలా హిందూస్తానీలో అదోమాదిరిగా దీర్ఘంతీస్తూ.

తీయని పానకం త్రాగుతుంటే గొంతుక్కు ఏదో పుల్ల అడ్డుపడినట్టనిపించింది. అయినా ఓర్చుకుని:-"పిండంలేదు; ఊరికే చూడ్డానికి వచ్చానంతే," అన్నాడు నిర్లిప్తతలో అతను అనుభవిస్తున్న ఆనందానికి ఆ క్షణమైనా విఘాతం కలిగించడం ఇష్టంలేక.

దారిలో కొంతమంది బ్రాహ్మణులు అతని టాంగావాలాతో ఏదో అరుస్తూ అంటున్నారు...

"అయితే పండాల గొడవ లేదన్నమాట" అన్నాడు టాంగావాలా-మళ్ళీ అందుకుని.

హరికృష్ణ దాన్ని వినిపించుకోలేదు. తన ఆలోచనల్లో మునిగిఉన్నాడు. ప్రయాగని గురించి అతనెంతో వినేవాడు. త్రివేణి సంగమంలో ఆ 'త్రివేణి' అని పదంమీద అతనికెంతో అభిమానం. యమున, సరస్వతి అనే పేర్లుకూడా ఇష్టమే. గంగ అనేమాట మీద అంత మోజులేదు. అయినా గౌరవం లేకపోలేదు. ఉత్తరాదిని సుభిక్షంచేసే నది అని. గంగపేరు విన్నప్పుడు శంతనుడి కథ గుర్తుకొచ్చింది. కాశీవద్ద పరిణానదీతీరాన తను కొంతమంది గ్రామీణుల్ని చూశాడు; ముఖ్యంగా స్త్రీలను-వాళ్ళూ అంతే! మత్స్యగంధుల్లా జాకెట్లు ధరించక, నునుపైన భుజాలను, దండలనూ ప్రదర్శిస్తూ, ఆకర్షణీయంగా కనుపించారు.

ఎందుకో ప్రవరుడు గుర్తుకొచ్చెడు. పొదలేపనం కరిగి, వరూధిని చిక్కులో పడ్డప్పుడు: "గయా, ప్రయాగా మొదలైనవి చూస్తాననుకోక ఈ హిమాలయా లెందుకు చూడాలని నాకు బుద్ధిపుట్టింది" అని వాపోతాడు. అతనికి పట్టని అదృష్టం తనకి పట్టింది.

అదీగాక అతనికి నెహ్రూమీద అమితమైన గౌరవం; నెహ్రూ స్వంతపట్నంలో ఉన్నాననే భావం అతనికి కొంత గర్వాన్ని కలిగించింది. ఈ నదీతీరాన నెహ్రూ స్వారీ చేసి ఉంటాడు. ఈ నదిలో అతడు ఈతలాడి ఉంటాడు–ఎడతెగని ఆలోచనలు!

టాంగా ఆగడంతో బాహ్యలోకస్ఫురణ కలిగింది.

"ఇక్కడే దిగండి. బాబూజీ. ఇక్కడ నావలు దొరుకుతాయి. అందరికోసం ఆగకండి. అయిదు రూపాయలిస్తే మీకు ప్రత్యేకంగా నావ కడతారు. సంగమం చూపిస్తారు" అన్నాడు టాంగావాలా నురుగు కక్కుతున్న గుర్రాన్ని తడుతూ.

హరికృష్ణ టాంగా దిగేడు. అంతలోనే ఒక రిక్షా ఆగడం, ఒక అందమైన యువతి అక్కడ దిగడం జరిగింది. ఆ అందానికి అతడు నిశ్చేష్టుడయ్యాడు. అసలే అతని హృదయం ఆనందానుభూతి అంచులను చేరుకుంది. ఆమె దర్శనం ఆ అనుభూతిని అధికం చేయసాగింది.

"సంగమం చూడ్డానికి వచ్చారా?" అన్నాడు.

"అవును."

"ఎక్కడ్నుంచి."

"పూనా."

"మహారాష్ట్రులా."

"క్రిస్టియన్సు."

"పేరు?"

"సరస్వతీ ఫిలిప్సు"

అతని తల తిరిగినట్టయింది. త్రివేణి సంగమంలో గంగా యమునలే గాని సరస్వతి కనపడదంటారు. అది అంతర్వాహినిగా ఉంటుందని విన్నాడు తను. ఆ సరస్వతే మానవరూపం పొంది తనకు సాక్షాత్కరించినట్టయింది. అతని ఆనందం మిన్ను ముట్టినట్టయింది.

"నడవండి" అన్నాడు రేవులోకి దారితీస్తూ.

"త్వరగా రండి" అన్నారు రిక్షావాడూ. టాంగావాడూ.

"వాళ్ల కామాటలు వినబడలేదు. యమునా నదిపైనుండి వస్తున్న వాయుతరంగాలలో లీనమైపోయాయి.

"దిగుతూ మీరెక్కడ్నుంచి వచ్చారు?" అంది సరస్వతి.

"హైదరాబాద్"

"ఎక్సర్షన్‌కు వొచ్చారా?"

"అవును."

"హిందువులు మత సంబంధంగా వస్తుంటారుగా. మీకట్లాంటి పనులు లేవూ?"

"నాకు నమ్మకాలు లేవు"

"కళ్ళు పెద్దవిచేసుకు చూసింది. అన్ని మెట్లూ దిగిన మూలాన అలిసింది కొంచెం. అక్కడ నావలవాళ్లు చేరేరు.

అతనో నావను మాట్లాడేడు. "మనం ఇతరులకోసం చూస్తే ఆలస్యమౌతుంది. ప్రత్యేకించి ఓ నావ మాట్లాడాను" అన్నాడు.

ఆవిడ "సరే" అన్నట్లుగా నేవ్‌నిటి బేగ్ త్రిప్పింది-నిజంగా చదువుల సరస్వతే! ప్రకృతి సౌందర్యాస్వాదన మర్చిపోయి సరస్వత్యుపాసనలోపడ్డాడతను. లేక బహుశా ఆ పరిసరాలు ఆవిడ సౌందర్యాన్ని ద్విగుణీకృతంచేసి వుంటాయి. అతడు అచేతనుడైనట్టు, ఏదో స్వప్నాంతరతదృశ్యంలో ఉన్నట్టు ఉన్నాడు.

"ఈ నీళ్లు చూడండి-ఎంత ఆకుపచ్చగా ఉన్నాయో?"

"ఆ కోట నీటిలో ప్రతిఫలించడం చూడండీ"

"ఈ నీరు రుచిచూడండి" ఏమేమో సరస్వతి అంటూంటే వింటూ మందస్మితవదనంతో, చూపులతో, జవాబియ్యసాగేడు.

నావ వాళ్లు తెడ్లువేస్తూ చెప్పసాగేరు.

"ఇది అశోకుడు కట్టించినకోట."

"ఈ ద్వారాన్ని ఔరంగజేబు మూయించేడు"

"దీని ద్వారానే అంతర్వాహిని సరస్వతి వస్తుందంటారు."

"ఇది ఆంజనేయస్వామిగుడి"

"ఇది రాణులు స్నానానికి వొచ్చె ద్వారం."

"అక్కడ్నుండే రాజపరివారం సంగమాన్ని చూస్తూవుండేవారు."

"ఇప్పుడది మిలటరీవాళ్లకిచ్చేరు."

అతని కన్నీ లీలగా వినపడుతున్నాయి. తనూ సరస్వతీ రాజూ, రాణీలా ప్రక్క ప్రక్కగా కూర్చున్నట్టూ, ఎన్నాళ్ళుగానో పరిచితులైనట్టూ దివా స్వప్నంలో తేలుతూ, సరస్వతి బంగారపు హస్తాలో నదీజలాన్ని తోడుతూ, మధ్యమధ్య ముంగురుల్ని సర్దుతూ తనకేసి ఓరగా, అసంబంధంగా చూస్తుంటే తన్మయుడవసాగేడు.

ఎవరుతను? ఎవరు సరస్వతి? తను నాస్తికుడు? ఆవిడ క్రిష్టియన్? ఏమిటీ తీర్థయాత్ర నమ్మకంలేని తను-నమ్మకం ఉండడానికి ఆస్కారంలేని అన్యమతానికి చెందిన ఆవిడా? ఇద్దరికీ పరిచయంలేదు-అసంబంధయాత్రీకులే!

పక్క నావలో పోతున్న బెంగాలీ ఆవిడ తడి నైలాన్ చీరతో కూచుని, జుత్తుగాలిలో ఆరబోసుకుంటోంది- శరత్ పాత్రలు గుర్తుకొచ్చాయి తనకి.

"మీరు క్రిష్టియన్లుకదా! ఈ హిందు యాత్రాస్థలం చూడ్డాని కెందుకొచ్చారు? అన్నాడు-అడగదల్చుకోని ప్రశ్న! ఆవిడ రాకపోతే తనయాత్ర ఇంత ఆనందదాయకమయ్యేదా? ఏమి మాయోగాని జీవితంలో ప్రతీదానికి అఫెమినైన్ టచ్ లేకపోతే చప్పగా ఉంటుంది.

"కల్చరల్ ఇంటరెస్ట్" అంది చప్పున విశాల నయనాలలోంచి ప్రశ్నార్థకంగా చూస్తూ:

"మీరు నాస్తికులమన్నారు కదా మీరెందుకొచ్చారు?" అంది కొంటెప్రశ్న తనలోనే నవ్వుకుంటూ-సిల్కు రుమాలు అడ్డుపెట్టుకుంది, నవరత్నాలు రాలుతాయనేమో.

సంగమం సమీపించారు. నావవాళ్ళు "ఇదుగో, ఇదే సంగమం. ఆగంగ నీళ్ళు చూడండి ఎట్లా ఉన్నాయో, ఇవుగో, ఇక్కడ చూడండి ఎట్లా పచ్చగా ఉన్నాయో" అని అరుస్తున్నారు.

"ఇక్కడ చూడండి ఎంత స్పష్టంగా కనపడుతున్నాయో" అంది సరస్వతి అతని భుజంమీద చెయ్యివేస్తూ. అతను ఆమెను చూడాలో సంగమాన్ని చూడాలో తెలీక తబ్బిబ్బవుతున్నాడు.

వాటర్ బాటిలిచ్చి "దింట్లో నీళ్లు పట్టండి" అన్నాడు. ఆమె దాన్ని తీసుకుంటుంటే వేళ్ళు కలిశాయి. అతనికి వొళ్ళు గగుర్పొడిచింది. ఆమె మామూలుగా వుంది. తనంటే అసహ్యంమాత్రం లేదనుకున్నాడు. అదే పదివేలు! మూతపెట్టి వాటర్‌బాటిల్ అతనికిచ్చింది.

"ఇక్కడ చూడండి మోకాలులోతే."

"స్నానం చేస్తారా?"

"ఊహు"

"ఏం?"

ఎంతో విచారిస్తూ అడిగేడు.

"ఏమో?" చప్పరించింది. అతనికి బలే కోపంవచ్చింది. కాని ఆవిడ్నేమి చేయగలడు? తనకేమీ కాదుగా? అయిన మరో పదిహేను నిమిషాల్లో ఈ తీయనికల కరిగిపోతుంది. ఎవరిదారిన వాళ్ళుపోతాం నావదిగేక ఎవరికెవరూ కారు.

నావవాళ్లెంతడుగుతే అంతా ఇచ్చి ఆ నావలో అక్కడే ఉండిపోతేనో అనుకున్నాడు. 'ఆవిడ వెళ్ళిపోకుండా వుంటుందా? నా పిచ్చిగాని' అని తిరిగి సముదాయించుకున్నాడు.

'ఎప్పటికీ వెన్నెలరాత్రి మంచిది కాదోయ్' అనే హిందీపాట అతనికి గుర్తుకొచ్చింది. ఆశిస్తాంకాని ఎప్పటికీ అమితమైన ఆనందాన్నీ, అందాన్నీ భరించగలమా విసుగురాదూ? తలనొప్పికూడా వస్తుందేమో? తాజ్‌మహాల్లో కాపరం పెడితే ఆనందం కలుగుతుందా? అజంతా ఎల్లోరాల్లో నివసిస్తే అనుభూతి శాశ్వతంగా ఉంటుందా ? నయాగారా జలపాతం దగ్గరుంటే ఆ చప్పుడుకు మొదడు బద్దలు కాదూ? అట్లాగే ఎప్పటికీ వెన్నెలలో వుంటే

చీకటికోసం పరుగు లెడతామేమో! - అంతెందుకూ? 'వెలుగులో నీమీద నిలుపలేనే మనసు' అనలేదూ నాయుడుబావా.

ఏదో నావవొచ్చి ప్రక్కనే ఆగింది. అక్కడ కొబ్బరికాయలూ, పూవులూ అర్పించి, బ్రాహ్మడికి ఓపూట భోజనానికి సంభావన ఇవ్వాలిట. అతను పర్సుతీసి ఇచ్చేడు. బ్రాహ్మడు ఆమెని కూడా చెయ్యి పట్టమన్నాడు. బొట్టు పెట్టుకోమన్నాడు. నావవాళ్ళూ అంతే. కొబ్బరికాయ ఇవ్వమన్నారు. అవి తనకి ఇష్టంలేదు. వాళ్లు ఆవిడ్ని అతని పత్నిగా భావించినట్లున్నారు, పాపం. వాళ్ళంతా ఆవిడ్ని బలవంతం చేస్తుంటే అతను లోలోపల సంతోషిస్తున్నాడు, ఏమీ అనలేదు. ఆవిడ పట్టుదల చూసి "రోమ్‌లో వున్నప్పుడు రోమన్లలా వుండాలి" అన్నాడు కొంత సేపయ్యాక.

"నాకు నమ్మకంలేదు."

"ఉండక్కర్లేదు; బుల్గానిన్, కృష్చేవ్‌లు ఇండియా వొచ్చినప్పుడు బొట్లు పెట్టుకోలేదూ? నాకుమాత్రం నమ్మకం వుందేమిటి?"

"మీరు హిందువులుగా?"

"కాను."

"మరీ?"

"ప్రపంచ పౌరుణ్ణి."

చిరునవ్వు నవ్వింది. సంగమంలోపడి పరావర్తనం చెందుతున్న సూర్యరశ్మిలో తెల్లని పల్వరస ముత్యాల్లా మెరవసాగింది.

"మీరు చెబుతున్నారు గనుక..." అని కొబ్బరికాయ పువ్వులు ఇచ్చింది. అతడేవో మంత్రాలు అనమన్నాడు. అనకుండా నవ్వింది. బ్రాహ్మడికి కోపంవచ్చి, "నవ్వరాదు" అంటూ ఏమేమో అన్నాడు. కొంత నీరు తీసుకుని పాపిడి వెంబడి రాసుకుంది హిందూ స్త్రీలా.

"ఇంక పోనియ్యండి" అంది-చిరుకోపంతో.

"అట్లా కోట ప్రక్కగా పోనియ్యండి" అన్నాడు హరికృష్ణ.

తిరుగు ప్రయాణంలో సరస్వతీ ఫిలిప్పుగారి చురుకుతనం మందగించింది- ఇష్టంలేని పని చేయాల్సి వచ్చిన మూలానగావును.

"అంతా మూఢనమ్మకాలు!" అని గొణిగింది, పిండాల రేవువద్ద చేరుతున్న లెక్కలేని నావల్నీ, వందలాది జనాన్ని చూస్తూ.

"అవును" అని, మరోక్షణం తర్వాత, "ఈ అణుయుగంలో సర్వమానవ సమానత్వమే ఏకైక మతంగాని, ఇతర మతాలలోనూ, కులాలకోసం అమితమైన నమ్మకం కలిగివుండడమూ మూఢనమ్మకం క్రిందికేవస్తుందేమో?" అన్నాడు - ఆవిడన్నదాన్నే జనరలైజ్ చేస్తూన్నట్టు.

అతని మొహంలోకి సూటిగా చూస్తూ ఉండిపోయింది ఓ క్షణం– పరీక్షకొరకో, అతని వాక్యంలోని సత్యాన్ని అవగాహన చేసుకోవడానికో, బొట్టు పెట్టుకొని హైందవ స్త్రీలా, గొప్ప గృహిణిలావున్న ఆమెని చూస్తు ముగ్ధుడవసాగేడు– అతను.

రేవు చేరేముందు వేనిటీ బేగ్‌లోని చిన్న అద్దాన్ని తీసుకుని, బొట్టు దులిపేసి పౌడరు రాసుకుంది. అట్లావున్నా అతనికి అందంగానే కనపడింది, ఆమె ముఖం–కళంకంలేని చంద్రబింబంలా.

"తర్వాత ప్రయాణం ఎక్కడికీ?"

"పూనా."

"కాశీ రారా?"

"అక్కడ్నించే వొచ్చాను."

అతని హృదయం చివుక్కుమంది. మధురానుభూతిని పొడిగిద్దామనుకున్న కోరిక పగటికలై పోయింది– నిజానికి తనూ తిరుగుప్రయాణికుడే!

రేవులో దిగుతుంటే అతని హృదయం భారమైనట్టు తోచింది– స్వర్గాన్నుంచి ఎవరో శపించి, భూలోకంలోకి పంపిస్తున్నట్టు.

మెట్లెక్కేటప్పుడు బాగా అలిసిపోయింది. మధ్యలో "ఎక్కేటప్పుడు ఇంత కష్టమౌతుందేం?" అంది.

"భూమ్యాకర్షణకి వ్యతిరేకంగా పోవాలిగా; చెయ్యి ఊత ఇమ్మంటారా?"

"థాంక్సు" అంది వద్దన్నట్టు, ఒకసారి గట్టుమీద కెక్కిన తర్వాత ఆఖరిసారి మళ్ళీ యమునానదినీ, కోటనీ, సంగమాన్నీ, నావల్నీ ప్రకృతి సౌందర్యాన్నీ వీక్షించారు.

రిక్షావాడు "రండమ్మా" అన్నాడు.

టాంగావాడు "పొద్దెక్కుతోంది బాబూజీ, ఇంకా ఆనందభవన్, కమలానెహ్రూ హాస్పిటల్, స్వరాజ్యభవన్, భరత్ మునిదేవల్... ... ... ఏమేమో అనసాగేడు.

సరస్వతి రిక్షా ఎక్కింది. అతడు వీడ్కోలు చెబుతున్నట్టుగా ఇంగ్లీషులోనే ధ్వంద్వార్థం ధ్వనించేటట్టు "ఈ త్రివేణి సంగమంవద్ద మనం కలుసుకోవడం ఆనందకర విషయం" అన్నాడు.

సరస్వతి మొదటిసారిగా సిగ్గుపడి తలవంచుకుంది. అతను నైతికజయం పొందినవాడిలా చూస్తూ, టాంగా ఎక్కేడు.

రిక్షా, టాంగాలు కదిలేయి. "గుడ్ బై" అంది రుమాలు వూపుతూ. ఆమాటలు డెక్కల చప్పుడులో కలిసిపోయేయి. "మళ్ళీ కలుసుకోవాలని ఆశిద్దాం" ఏలోకంలో ఏ కాలంలో, ఏ రూపంలోనో? అందామనుకున్నాడు. కాని అంత సమయమూలేదు; ధైర్యమూలేదు. రెండు బళ్ళూ రెండువైపులకూ పోతున్నాయి.

"బై, బై" అన్నాడు తన రుమాలునూపుతూ – వాటర్ బాటిల్ దగ్గరికి తీసుకున్నాడు – సరస్వతి నింపిన పవిత్రోదకముంది దానిలో.

ఈ నాటికీ, ఏనాటికి మర్చిపోలేడా సంఘటన నతడు; అంతర్వాహిని సరస్వతే ఆ రూపంలో సాక్షాత్కరించిందని, అతని అంతరాత్మ ఘోషిస్తోంటే అవునేమో ననిపిస్తుందతనికి– వింతగా మూఢనమ్మకాల్లో నమ్మకంలేని నాస్తికుడైనప్పటికీ.

'అసంబంధ యాత్రీకులం' అని నవ్వుకుంటాడు తనలో తానే – ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడల్లా – జీవితంలో చివరికి మిగిలేది ఈ ఆనందపుటనుభూతుల పాత జ్ఞాపకాల తుంపరల పరంపరలే నేమో?

18. 11. 1959–ఆంధ్ర సచిత్ర వారపత్రిక